క్లుప్తంగా

కోవెలకుంట్ల సీఐగా హనుమంతనాయక్



కోవెలకుంట్ల: కోవెలకుంట్ల పోలీస్‌సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా హనుమంతనాయక్‌ను నియమిస్తూ జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో తిరుపతిలో పనిచేస్తున్న జయచంద్ర ఇక్కడ సీఐగా విధులు నిర్వర్తిస్తున్నారు. సీఐల సాధారణ బదిలీల్లో ఆళ్లగడ్డ రూరల్‌సీఐగా పనిచేస్తున్న హనుమంతనాయక్‌ను నియమించారు. ఈ మేరకు ఆయన త్వరలో ఇక్కడ సీఐగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

రోగులకు పౌష్టికాహారం పంపిణీ



రోగులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న దృశ్యం

డోన్: ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న గర్భిణులు, బాలింతలు, రోగులు, వారి సహాయకులకు ఆదివారం ఆదరణ వృద్ధాశ్రమం వ్యవస్థాపకులు జాన్ ప్రభాకర్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ జరిగింది. స్థానిక రాధాకృష్ణ స్వీట్స్ యజమాని చిదంబరం ఆర్థిక సహాయంతో అందరికీ రొట్టె, గుడ్డు, పప్పు పంపిణీ చేశారు.

డ్రైనేజీల్లో పూడిక తొలగింపు



21వ వార్డులో పర్యటిస్తున్న మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం

డోన్: పట్టణంలోని డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం ఇసుక మేటలను యుద్ధ ప్రాతిపదికన తొలగిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. పట్టణంలోని 21వ వార్డులో ఆదివారం ఆయన స్టాప్ డయేరియా వంద రోజుల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డ్రైనేజీలలో మురుగునీరు సక్రమంగా పారేందుకు ఏర్పడే అడ్డంకులను తొలగించిన తర్వాత ఆ ప్రాంతాలలో బ్లీచింగ్, సున్నం పౌడర్లను చల్లాలని సిబ్బందిని ఆదేశించారు. డీఈ రసూల్, ఏఈ సతీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా ఉన్నారు.

సంఘం అభివృద్ధికి పాటుపడాలి



మాట్లాడుతున్న దత్తాత్రేయశర్మ

డోన్ టౌన్ : బ్రాహ్మణ సంఘం, సంఘీయుల అభివృద్ధికి కృషి చేయాలని వేద గాయత్రీ బ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షుడు, కళారత్న, శతావధాని గండ్లూరి దత్తాత్రేయశర్మ అన్నారు. పట్టణ సమీపంలోని గాయత్రి పీఠంలో ఆదివారం ఆ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలపై సభ్యులో చర్చించారు. సమావేశంలో అధ్యక్షులు శంకర్ శర్మ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసుల శర్మతో పాటు సంఘం సభ్యులు ఉన్నారు.

విషపురుగు కాటుకు ఎద్దు మృతి



మృతి చెందిన ఎద్దు

ప్యాపిలి: మండల పరిధిలోని రాంపురం గ్రామంలో ఆదివారం విషపురుగు కాటుకు ఎద్దు మృతి చెందింది. గ్రామానికి చెందిన రైతు కృష్ణ మధ్యాహ్నం తన ఇంటి ఆవరణలో ఎద్దును కట్టి ఉంచాడు. కొద్దిసేపటి తర్వాత చూడగా ఎద్దు నోటి నుంచి నురుగు వచ్చి మృతి చెందింది. విషపురుగు కాటుకు ఎద్దు మృతి చెందినట్లు రైతు తెలిపాడు. ఎద్దు మృతితో తనకు రూ.40 వేలు నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయాడు.

యువకుల ఘర్షణ

డోన్ టౌన్ : పట్టణంలో గత కొద్ది రోజులుగా యువత రోడ్లపై దాడులకు, ప్రతిదాడులకు పాల్పడుతున్న వరుస సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. గత వారంలో పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో, తారకరామనగర్ లో జరిగిన దాడుల ఘటనలకు సంబంధం ఉన్న ఒక్కరిని కాలేజీకు వెళ్లే దారిలో అడ్డగించి దాడి చేసిన ఘటనకు సంబంధించిన వీడియో ఆదివారం పట్టణంలో వైరల్ అయ్యింది. ఒక అబ్బాయిని పట్టుకొని కొందరు కలిసి దాడి చేస్తూ వీడియో తీశారు. ఈ విషయంపై పట్టణ పోలీసులను వివరణ అడుగగా గతంలోనే ఇరువర్గాలపై కౌంటర్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

తహసీల్దార్ బదిలీ

సంజామల: సంజామల తహసీల్దార్ జ్యోతి రత్న కుమారి ఆళ్లగడ్డకు బదిలీ అయ్యారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ జి రాజకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈమె కడప జిల్లా నుంచి సంజామలకు బదిలీపై వచ్చారు. సాధారణ బదిలీలలో భాగంలో ఆళ్లగడ్డకు బదిలీ అయ్యారు. అయితే సంజామలకు ఇంతవరకు ఎవరిని నియమించలేదు.

దౌర్జన్యాలు... దాడులు!

- పెట్రేగిపోతున్న అసాంఘిక శక్తులు
- మితిమీరుతున్న ఆగడాలు
- విచ్చలవిడిగా నాటుసారా తయారీ, పేకాట, మట్కా నిర్వహణ
- నూతన సీఐ రమేష్‌బాబుకు అన్నీ సవాళ్లే



కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్



సీఐ రమేష్‌బాబు

కొలిమిగుండ్ల: అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ కొలిమిగుండ్లకు రెండో సీఐగా రమేష్ బాబు రానున్న విషయం తెలిసిందే. ఒకటి రెండు రోజుల్లో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. ఫిబ్రవరిలో స్టేషన్‌ను అప్‌గ్రేడ్ చేయడంతో ఎస్ఐ స్థానంలో సీఐ పోస్టు మంజూరు చేశారు. ఈ స్టేషన్‌కు మొదటి సారిగా నియమించబడిన సీఐ గోపీనాథ్‌రెడ్డి దాదాపు ఆరు నెలల పాటు విధులు నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బదిలీల పర్వం మొదలైంది. ఈ కోవలోనే రెండు రోజుల క్రితం నియమించబడిన సీఐ రమేష్‌బాబుకు అన్నీ సవాళ్లే ఎదురుకానున్నాయి. నాపరాతి గనులకు నిలయమైన కొలిమిగుండ్ల మండలంలో ఒకప్పుడు చాలా గ్రామాలో ఫ్యాక్షన్‌తో అట్టుడుకుతుండేది. క్రమేణా మార్పుల నేపథ్యంలో మండలంలో ప్రశాంత వాతావరణం ఏర్పడింది. ఫ్యాక్షన్ దాదాపు కనుమరుగు అయ్యింది. అక్కడక్కడ వర్గాలు, విభేదాలున్నా... సర్దుకుపోతున్నారు నాయకులు. రాజకీయంగా టీడీపీ, వైఎస్సార్‌సీపీ వర్గాలు ఉన్నప్పటికీ రాజకీయంగానే పోటీపడుతున్నాయి. ప్రస్తుత కారణాలు అటుంచుతే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మండలంలో పరిస్థితి పూర్తిగా మారిందని చెప్పక తప్పని పరిస్థితి. టీడీపీ నాయకుల దౌర్జన్యాలు, దాడులు పెరిగాయనే విమర్శలు అన్నివర్గాల ప్రజల నుంచి వెల్లువెత్తుతున్నాయి. కొందరు టీడీపీ వర్గీయులు బెలుం శింగవరం, అబ్దులాపురం, కొలిమిగుండ్ల, అంకిరెడ్డిపల్లె, కొలిమిగుండ్ల గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడ్డారు. కనకాద్రిపల్లెలో ఏకంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఇళ్లకు కుళాయి కనెక్షన్‌లు కట్ చేశారంటే దౌర్జన్యాలు ఏ స్థాయిలో ఉన్నాయో ఇట్టే అర్థం అవుతుంది. మరి కొన్ని గ్రామాల్లో బెదిరింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో మళ్లీ పాత రోజులు వచ్చాయా... అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి దౌర్జనాయలు, దాడులకు నూతనంగా బాధ్యతలు స్వీకరించనున్న సీఐ అడ్డుకట్ట వేస్తారా.. లేదా అనే చర్చ మండలంలో మొదలైంది.

విచ్చలవిడిగా నాటుసారా...

గ్రామాల్లో మంచినీళ్లు దొరక్కపోయినా నాటుసారా పుష్కలంగా లభిస్తుందనే విమర్శలు ఉన్నాయి. బహిరంగంగానే విక్రయాలు జరుగుతున్నాయి. మందు బాబులు ఎక్కడుంటే అక్కడికే సారా ప్యాకెట్లను డెలివరీ చేస్తున్నారని మహిళలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. అడపాదడపా దాడులు జరుగుతున్నా విక్రయదారులు మాత్రం అమ్మకాలు ఆపడం లేదు. అదేవిధంగా మట్కా విచ్చలవిడిగా సాగుతోంది. అంకిరెడ్డిపల్లెలో ఆరు, ఏడు మంది బీటర్లు పట్టపగలే రాస్తున్నారనే విషయం బహిరంగ రహస్యం. ఇక్కడ రోజుకు రూ. లక్షల్లో మట్కా జరుగుతున్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు కూడా. పేకాట సైతం జోరుగా సాగుతుంది. అసాంఘిక కార్యకలాపాలు పెరిగిపోయాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో కొత్త బాస్ సీఐ.. శాంతి భద్రతలను గాడిలో పెట్టి అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపేనా అనే చర్చ జోరుగా సాగుతోంది.

కొలిమిగుండ్ల స్టేషన్‌కు మొదటి నుంచీ డిమాండే....

నాపరాతి గనులకు ప్రసిద్ధి చెందిన కొలిమిగుండ్ల మండల పోలీస్ స్టేషన్‌కు మొదటి నుంచీ డిమాండ్ ఉంది. గతంలో డీఎలు పడిన ప్రతి సారి పది మందికి పైగానే ఎస్ఐగా వచ్చేందుకు పోటీలో ఉండేవారు. ఈ స్టేషన్‌ను ఓ విధంగా ఆదాయ వనరుగా చెప్పుకుంటారు. అప్‌గ్రేడ్ అయ్యాక సీఐ పోస్టుకు అదే పరిస్థితి నెలకొంది. తాజాగా ఎడెనిమిది మంది సీఐలు ఇక్కడ పోస్టింగ్ కోసం పోటీపడినట్లు సమాచారం. పోస్టింగ్ కోసం టీడీపీ నేతల చుట్టు ప్రదక్షిణలు చేశారట. ఎట్టకేలకు రమేష్‌బాబు ఇక్కడికి నియమించబడ్డారు. ఏదిఏమైనా కొత్త సీఐకి అన్ని సవాళ్లే అనేది మాత్రం వాస్తవం.

వ్యవసాయానికి ఈ వారం విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామమోహన్ చెప్పారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, రేవనూరు, కలుగొట్ల, కోవెలకుంట్ల, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు. జోళదరాశి ఫీడర్ పరిధిలోని గ్రామాల్లో తెల్లవారుజామున 4 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని వివరించారు.

సంజామల: మండలంలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటిపూట వేళల్లో తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. సంజామల, ఆకుమల్ల, నొస్సం, పేరుసోముల విద్యుత్ సబ్ స్టేషన్‌ల పరిధిలోని ఫీడర్ల విద్యుత్ సరఫర వేళలు వివరించారు. ముక్కమల్ల, వసంతాపురం, కమలపురి, ఆల్వకొండ, గిద్దలూరు, ఆర్. లింగందిన్నె, అక్కంపల్లె, రామిరెడ్డిపల్లె, ముక్కమల్ల, కానాల, ముదిగేడు, రెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె తదితర ఫీడర్ల పరిధిలో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ వివరించారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : ఇండస్ట్రీయల్ సబ్ స్టేషన్ పరిధిలోని గోసానిపల్లె, టౌన్ ఫీడర్ల కింద మరమ్మతుల కారణంగా సోమ, మంగళ వారాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డోన్, కొచ్చెర్వు గ్రామాల మధ్య ఉన్న ఫ్యాక్టరీలు, పొలాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు కరెంటు ఉండదని పేర్కొన్నారు. అలాగే గోసానిపల్లె గ్రామ రైతులకు తెల్లవారుజామున 3 నుంచి 9గంటల వరకు మరలా సాయత్రం 3 నుంచి 6 గంటల వరకు విద్యుత్ ఇస్తామన్నారు.

బనగానపల్లె రూరల్ : మండలంలోని యనకండ్ల విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని హుస్సేనాపురం, ఇండస్ట్రీయల్ ఫీడర్ల మరమ్మతు పనుల నేపథ్యంలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ గర్జప్ప తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. హుస్సేనాపురం, యత్రగుడి ఫీడర్ల పరిధిలో వ్యవసాయానికి సంబంధించి తెల్లవారుజాము 3 నుంచి 9 ఉదయం గంటల వరకు, అలాగే మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా చేస్తామని ఏఈ వివరించారు.


ఘనంగా చౌడేశ్వరీ మాత జయంతి





బేతంచెర్ల చౌడేశ్వరీ మాతకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు, కోవెలకుంట్ల :ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

బేతంచెర్ల : పట్టణానికి సమీపాన కొలుములపల్లె రహదారిలో వెలసిన చౌడేశ్వరీ మాత పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆషాడమాసం అమావాస్య సందర్భంగా చౌడేశ్వరీ మాతకు ఉదయం అభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. హెచ్ కొట్టాల గ్రామంలో వెలసిన చౌడేశ్వరీ మాత ఆలయంతో పాటు బనగానపల్లె రహదారిలోని పుట్టపెద్దమ్మకు రామకృష్ణ ఆధ్వర్యంలో ఆయా కాలనీలకు చెందిన భక్తులు, బైటిపేట వెలసిన గాడుబావి వీరాంజనేయ స్వామి ఆలయంలో స్వామి వారికి అభిషేకం, ఆకు పూజ, మహామంగళహారతి గావించారు. సాయంత్రం చౌడేశ్వరీ మాత ఉత్సవమూర్తిని గ్రామ పురవీధుల గుండా మంగళవాయిద్యాల మధ్య ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గౌరి హుసేన్‌రెడ్డి, రఘురామిరెడ్డి, సుబ్బారెడ్డి, రామస్వామి పాల్గొన్నారు.



కొలిమిగుండ్ల: ఆషాడ మాసం ఆదివారం చౌడేశ్వరిదేవి జయంతి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహిచారు. కోటపాడు, మదనంతపురం, కొలిమిగుండ్ల, రాఘవరాజుపల్లె సమీపంలోని శక్తి పురం చౌడేశ్వరి దేవి ఆలయాలు భక్తులతో రద్దీగా మారాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకుని నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదారం చేశారు.



బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయంలో ఆదివారం అమ్మవారి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి ఉదయం పాతఃకాలపూజ మహామంగళ హారతి, గణపతి పూజ, చండీహోమం,అభిషేకం, సహస్తనామార్చన తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం పల్లకీ సేవ, సహస్రదీపోత్సవసేవ, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

కోవెలకుంట్ల: బనగానపల్లె నియోజకవర్గంలోని చౌడేశ్వరీ ఆలయాల్లో అమ్మవారి జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కోవెలకుంట్ల పట్టణంలోని సంతపేట, జోళదరాశి, భీమునిపాడు గ్రామాల్లో భక్తులు అమ్మవారి జయంతిని పురస్కరించుకుని అర్చనలు, అభిషేకాలు తదితర పూజలు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

సేవలకు సత్కారం



మధును సత్కరిస్తున్న దృశ్యం



అవార్డు అందుకుంటున్న ద్రోణాచలం సేవాసమితి వ్యవస్థాపకుడు రాజు

డోన్/డోన్ టౌన్ : పట్టణానికి చెందిన సామాజిక స్వచ్ఛంద సంస్థ స్ఫూర్తి సేవా సమితి, ద్రోణాచలం సేవాసమితికి శ్రీకాళహస్తిలో అరుదైన గౌరవం దక్కింది. శ్రీకాళహస్తికి చెందిన యువతరం సేవా సంస్థ పదో వార్షికోత్సవం సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల స్వచ్ఛంద సేవకులను ఆదివారం సత్కరించారు. అందులో భాగంగా నిత్యం సేవా కార్యక్రమాలు చేస్తున్న స్ఫూర్తి సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సీసీంగుంతల ఆలా మధుకు ఉత్తమ సేవా రత్న అవార్డుని అందించి సత్కరించారు. అలాగే ద్రోణాచలం సేవాసమితి వ్యవస్థాపకులు షాదీఖాన రాజు మిత్ర బృందాన్ని ఘనంగా సత్కరించి మెమొంటోలను అందజేశారు.

ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తున్నాం

అవుకు: ఎస్సీ వర్గీకరణను ఆయా రాష్ట్రాల వారీగా విభజన చేసుకోవచ్చని సుప్రీం కోర్టు ఈనెల 1వ తేదీన ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తున్నామని జైభీమ్ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు ఆవుల దేవరత్నం, రాష్ట్ర కన్వీనర్ ఆవుల సుధాకర్ బాబు పేర్కొన్నారు. ఆదివారం అవుకు గ్రామంలోని ఎస్సీ కాలనీలో సభ్యులతో కలిసి నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. 2004లో ఐదుమంది ధర్మాసనం ఇచ్చిన న్యాయస్థానం ఆనాడు చెల్లదని, ఇప్పుడు 7 మంది సభ్యులతో అదే ధర్మాసనం వర్గీకరణను చేసుకోవచ్చని తీర్పు ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలకు అనుకూలంగా సుప్రీంకోర్టు పనిచేస్తుందన్నారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఈనెల 8,9,10 తేదీల్లో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద చేపట్టే ధర్నాకు పార్టీలకు అతీతంగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాల సంఘాల నాయకులు, కార్యకర్తలు పిల్లి కంబగిరి, ఆవుల వినయ్ కుమార్, పేరి భాస్కర్, పోతుల భూపాల్, ఆవుల చిన్న సింగిరి రంగన్న, బరాబర్ చంద్ర, పిల్లి జాన్, ఆవుల పాతుఉ, కటారి యాదవ్, ధార ఓబులేసు పాల్గొన్నారు.

కొత్త రోడ్డుపై గుంతలు



ఎంపీడీఓ కార్యాలయం వద్ద కొత్తగా నిర్మించిన డబుల్ రోడ్డుపై కేబుల్ కోసం తీసిన గుంత

బనగానపల్లె : బనగానపల్లె పట్టణంలో నూతనంగా నిర్మించిన రోడ్డుపై గుంతలు తీస్తుండడంతో పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ పాలనలో పట్టణంలోని కొత్త బస్టాండ్ నుంచి జీఎం టాకీస్ సర్కిల్ వరకు రూ.8 కోట్లు నిధులు వెచ్చించి డబుల్ రోడ్డు, సెంటర్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేశారు. దీంతో గత కొన్ని ఏళ్ల నుంచి అధ్వానంగా ఉన్న రోడ్డు బాగుపడటంతో పట్టణ వాసులు సంతోషం వ్యక్తం చేశారు. అయితే ఇటీవల ఓ ప్రైవేట్ సంస్థ తమ నెట్‌వర్క్ కేబుల్‌ను ఏర్పాటు చేసేందుకు నూతంగా నిర్మించిన రోడ్డు వెంట అక్కడక్కడ గుంతలు తవ్వతున్నారు. సిమెంట్ రోడ్డు ఉన్న చోట కటింగ్ మిషన్ల ఏర్పాటు చేసి గంతలు తీసి కేబుల్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రైవేట్ సంస్థ వారు రోడ్డు నిర్మించక ముందు కేబుల్ ఏర్పాటు చేసుకుని ఉంటే బాగుండేదని, కొత్తగా నిర్మించిన రోడ్డును ధ్వంసం చేసి కేబుల్ వేయడం పట్ల పలువురు విమర్శలు చేస్తున్నారు. గుంతలు తీసిన సంస్థ మళ్లీ వాటిని పూడ్చివేసిన రోడ్డు నాణ్యత పటిష్టంగా ఉండదని నిపుణులు చెబుతున్నారు. ఈ విషయంపై ఆర్‌అండ్‌బీ ఏఈ హుస్సేన్‌ను వివరణ కొరగా జిల్లా ఉన్నతాధికారుల అనుమతితో ప్రైవేట్ సంస్థ వారు కేబుల్ ఏర్పాటు చేసేందుకు గుంతలు తీస్తున్నారని, వాటిని వారే మళ్లీ నిర్మిస్తారని పేర్కొనడం గమనార్హం.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం ద్వారా ఒకే వేదికపై కలుసుకున్న 1982-84 బ్యాచ్ విద్యార్థులు

అ'పూర్వ' కలయిక

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని ముక్కెర ఫంక్షన్ హాలులో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. కోవెలకుంట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల 1982–84 విద్యా సంవత్సరంలో ఇంటర్ చదివిన పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై చేరారు. వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రవేట్ ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు దాదాపు 42 సంవత్సరాల తర్వాత కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుంటూ ఉల్లాసంగా గడిపారు. రాబోయే రోజుల్లో పూర్వ విద్యార్థుల్లో ఎవరైనా అనారోగ్యంతో బారిన పడితే ఆర్థికసాయం అందించేలా పూర్వ విద్యార్థులు తీర్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు గుద్దేటి చంద్రశేఖర్ రెడ్డి, కాల్వ నాగేశ్వరరావు, బాలమురళీకృష్ణ, ముగ్బల్, రాంమోహన్‌రెడ్డి, సుబ్బయ్య, సుధాకర్‌రెడ్డి, నాగభూషణం, వెంకట్రామిరెడ్డి రంగారావు, వెంకటసుబ్బారెడ్డి, కేశవరెడ్డి, నాగరంగయ్య, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

14న యాగంటిలో బహిరంగ వేలాలు

బనగానపల్లె రూరల్ : మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమా మహేశ్వరస్వామి ఆలయంలో వ్యాపారాలు నిర్వహించేందుకు బహిరంగ వేలాలను 14వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఈఓ చంద్రశేఖర్ రెడ్డి ఆదివారం తెలిపారు. కొబ్బరికాయలు అమ్ముకునేందుకు, తలనీలాలు పోగు, పండ్లు, బొమ్మలు, ఐస్‌క్రీం విక్రయాల హక్కులు పొందేందుకు బహిరంగవేలాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు.

వర్గీకరణ అమలుకు కృషి చేయాలి

డోన్ టౌన్ : ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తూ రాష్ట్రాలకు అధికారం బదలాయిస్తూ సుప్రీం కోర్టు వెలవరించిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేసే విధంగా ఎమ్మెల్యేలు కృషి చేయాలి సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యవర్గ సభ్యులు ధర్మారం రంగనాయకులు కోరారు. ఆదివారం డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డిని ఆయన స్వగృహంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఐఎఫ్‌టీయూ మండల కార్యదర్శి బందెనాజ్‌వలి, పట్టణ అధ్యక్షుడు చందు, నాయకులు మునీంద్ర, రవి ఉన్నారు.

ఆరుగురిపై కేసు నమోదు

ప్యాపిలి: మండల కేంద్రంలో శనివారం పాతకక్షలతో ఓ వర్గం మరో వర్గంపై దాడి చేసిన ఘటనలో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ప్యాపిలి పోలీసులు ఆదివారం తెలిపారు. కమలాకర్ వర్గీయులు దాడి చేయడంతో బలరాముడు, పులిశేఖర్, రంగమ్మ గాయపడిన విషయం విదితమే. బలరాముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కమలాకర్, కళ్యాణ్, శేఖర్, దివాకర్, లక్ష్మి, సునీతపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్యవైశ్య విద్యార్థులకు చేయూత




ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న దాతలు

డోన్ టౌన్ : వాసవీ విద్యా చేయూత పథకం కింద ఆర్యవైశ్య నిరుపేద విద్యార్థులకు దాతల సహకారంతో ఆర్థిక సాయం అందజేశారు. ఆదివారం పట్టణంలోని అమ్మవారిశాలలో ఆవోపా, ఆర్యవైశ్య సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో 33 మంది విద్యార్థులకు రూ.2.05లక్షలను దాతల చేతుల మీదుగా అందజేశారు. అలాగే కర్నూలు, నంద్యాల జిల్లాల అవోపా అధ్యక్షుల సౌజన్యంతో 200 లాంగ్ నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం వాసవీ ఉద్యోగ విరమణలో భాగంగా ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన రిటైర్డు తహసీల్దార్ బొగ్గరపు నాగభూషణం, ఉపాధ్యాయుడిగా పదవీ విరమణ చేసిన మనుసాని శ్రీనివాసులను సంఘం తరుపున ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొత్రికె హరికిషన్, కార్యదర్శి రంగయ్య, కోశాధికారి వెంకటేశ్వర్లు, ఆవోపా రాష్ట్ర కార్యదర్శి శివపురం నాగరాజు, రీజినల్ ఉపాధ్యక్షులు అంబికేశ్వరశెట్టి, డోన్ అధ్యక్ష కార్యదర్శులు మాకం కృష్ణకిషోర్, జొన్నలగడ్డ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పరామర్శ

కొలిమిగుండ్ల: జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిని స్వగ్రామం నాయినపల్లెలో ఆదివారం పలువురు నాయకులు పరామర్శించారు. ఇటీవల మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీలో చేపట్టిన ధర్నాకు జెడ్పీ చైర్మన్ వెళ్లారు. అక్కడే బస చేసిన గదిలోని బాత్‌రూంలో ప్రమాదవశాత్తు కింద పడడంతో ఎడమ చేయి మణికట్టు వద్ద విరిగింది. కర్నూలులో చికిత్స చేయించుకున్నారు. రెండు రోజుల క్రితం కర్నూలు సర్వజన వైద్య శాలలో పక్కకు తొలగిన ఎముకలను సరిచేశారు. నాయినపల్లెలో విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత సత్తిగారి రామిరెడ్డి, వైస్ ఎంపీపీ క్రిష్టారెడ్డి, నాగిశెట్టిపల్లె సర్పంచ్ ఈశ్వరయ్య, నాయకులు రామసుబ్బయ్య, తోట మల్లేశ్వరరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

షఢ్రక్ అడుగు జాడల్లో నడవాలి



షడ్రక్ చిత్ర పటానికి జోహార్లు అర్పిస్తున్న నాయకులు

డోన్ టౌన్ : బడుగు బలహీన వర్గాల కోసం పోరాడిన షడ్రక్ ఆశయ సాధన కోసం యువత ఆయన చూపిన మార్గంలో నడవాలని సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు నక్కి శ్రీకాంత్, కొయిలకొండ నాగరాజు పిలుపునిచ్చారు. ఆదివారం సీపీఎం కార్యాలయంలో షడ్రక్ 4వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉద్యమాలు, పార్టీ అభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలు గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొండన్న, శివరామ్, చిన్నరహిమాన్, భాస్కర్‌రెడ్డి, రామాంజనేయులు, మద్దయ్య తదితరులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- విద్యతోనే పేదరిక నిర్మూలన
- జూనియర్ సివిల్ జడ్జి అబ్దుల్ రెహమాన్



గిద్దలూరు మెడికల్ క్యాంప్‌లో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి అబ్దుల్ రెహమాన్

సంజామల: ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే హక్కులు సాధించుకుంటారని కోవెలకుంట్ల జూనియర్ సివిల్ జడ్జి అబ్దుల్ రెహమాన్ సూచించారు. మండల పరిధిలోని గిద్దలూరు గ్రామంలోని చీమలతిప్ప కాలనీలో ఆదివారం ఉచిత మెడికల్ క్యాంప్, న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి అబ్దుల్ రెహమాన్ మాట్లాడుతూ విద్య చాలా విలువైనదని, తల్లితండ్రులు తమ పిల్లలను చదివించాలని సూచించారు. చదువుతోనే ఏదేనే సాధించవచ్చునని, పేదరికాన్ని నిర్మూలించాలంటే విద్య ఒక్కటే మార్గమని చెప్పారు. పేదల అభివృద్ధికి ప్రభుత్వాలు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని, విద్య ఉన్నప్పుడే వాటిపై అవగాహన పొందుతారన్నారు. అనంతరం డాక్టర్స్ చంద్రశేఖర్ రెడ్డి, సృజన, వినోద్ కాలనీ వాసులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరం మేరకు ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రసిడెంట్ శ్రీనువాసులు, కార్యదర్శి ఓబులేసు, న్యాయవాదులు విష్ణు మనోహర్, తిరుపాల్, నరసింహులు, కంబగిరి, ఇంద్రకుమార్, ఏఎస్ఐ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.